



టిసి వరుణ్



పూల నాగరాజు

మరో ఇద్దరికి నామినేటెడ్ పదవులు

అహుడా ఛైర్మన్‌గా టిసి వరుణ్

ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండో జాబితాను విడుదల చేసింది. ఈ మేరకు శనివారం విడుదల చేసిన రెండో జాబితాలో అనంతపురం జిల్లా నుంచి ఇద్దరికి పదవులు దక్కాయి. అందులో జనసేన నుంచి ఒకరికికాగా, టిడిపి నుంచి ఒకరికి పదవి దక్కింది.

అహుడా ఛైర్మన్‌గా టిసి వరుణ్

అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (అహుడా) ఛైర్మన్‌గా టిసి వరుణ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన నాయకుడిగానున్న టిసి వరుణ్ ముందు నుంచి చిరంజీవి, పవన్‌కళ్యాణ్ కుటుంబానికి విధేయులుగా ఉంటూ వస్తున్నారు. 2009లో ప్రజారాజ్యాం పార్టీ పెట్టిన సమయం నుంచి వారి వెంటే ఉంటూ వస్తున్నారు. 2019లోనూ జనసేన తరుపున టిసి వరుణ్ అనంతపురం అర్బన్ అసెంబ్లికి పోటీ చేసి ఓటమి చెందారు. గత ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా అనంతపురం అర్బన్ స్థానం టిడిపికి ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆయనకు అహుడా ఛైర్మన్ పదవిని జనసేన కోటాలో ఇచ్చారు. అంతక మునుపు అహుడా ఛైర్మన్‌గా మహాలక్ష్మి శ్రీనివాసులు ఉండేవారు. వైసిపి ఓటమి తరువాత ఆ పార్టీ నాయకులందరూ పదవుల నుంచి తప్పుకున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక నియమించిన నామినేటెడ్ పోస్టుల్లో టిసి వరుణ్‌కు అహుడా ఛైర్మన్ పదవి దక్కింది.

ఆర్టీసీ రిజనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు

తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పూల నాగరాజును ఆర్టీసీ రిజనల్ ఛైర్మన్‌గా నియమించారు. 2018లో జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పూల నాగరాజు పనిచేశారు. ఆయన ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి ప్రయత్నించారు. అయినా అవకాశం లభించలేదు. ఇప్పుడు ఆయనకు ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పదవిని ప్రభుత్వం కేటాయించింది.

ఇళ్లపట్టాలిచ్చేవరకూ పోరాటం...



- దౌర్జన్యంగా పేదల గుడిసెలు తొలగింపు
- అర్ధరాత్రి పోలీసుల చర్య అమానుషం
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



పెనుకొండ రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు, పేదలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ పరిధిలోని కొల్లకుంట సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టా ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కొల్లకుంట సమీపంలో సుమారు 8.5 ఎకరాల భూమిలో తొమ్మిది నెలల క్రితం సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి పట్టణంలో 446 నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకున్నారు. అదే స్థలంలో సుమారు 3 ఎకరాల భూమిని జర్నలిస్టు కుటుంబాలకు కేటాయించాలని పట్టణంలో ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వానికి విన్నవించారు. అయితే రెవెన్యూ అధికారులు ఈ భూమిని ఎవరికీ కేటాయించకుండా శనివారం తెల్లవారుజామున వందలాది మంది పోలీసుల బందోబస్తుతో జేసీబీలతో గుడిసెలను తొలగించారు. అడ్డువచ్చిన నాయకులను అరెస్టు చేసి హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీనిని నిరసిస్తూ సిపిఎం జిల్లా నాయకులు జెడ్ పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెనుగొండ రహదారిపై లబ్ధిదారులు రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనకు కూడా పోలీసులు భగ్నం చేశారు. ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్టు చేసి లేపాక్షి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సంఘటనను నిరసిస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ బాధితులతో కలిసి హిందూపురం తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన పేదల సొంతింటి కల మాత్రం నెరవేర్చడం లేదన్నారు. నిలువ నీడలేని నిరుపేదలు సొంతింటి కల నెరవేర్చుకోవడానికి సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటం చేస్తే అధికారులు పోలీసులను అడ్డం పెట్టుకొని అర్ధరాత్రి అమానుషంగా ప్రవర్తించడం అన్యాయమన్నారు. కొల్ల కుంట సమీపంలో సిపిఎం చేసిన భూ పోరాట స్థలంలో పాత్రికేయులతో పాటు అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జర్నలిస్టుల, పేదల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈఎస్ వెంకటేష్‌తో పాటు సిపిఎం నాయకులు, భూ పోరాట కమిటీ నాయకులు, పేదలు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో వైద్యచికిత్స

పోలీసులు గుడిసెలను ఖాళీ చేయించే సమయంలో సిపిఎం నాయకులు, బాధితులు పోలీసులకు అడ్డుపడ్డారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిపై దాడి చేశారు. ఈ దాడిలో దెబ్బలు తగిలిన వారికి లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఆధ్వర్యంలో వైద్యచికిత్సలు అందించారు.

సిపిఎం నాయకుల అర్ధరాత్రి అరెస్టు

లేపాక్షి : హిందూపురం మండల పరిధిలో సిపిఎం ఆధ్వర్యంలో వేసిన గుడిసెలు తొలగించడం కోసం పోలీసులు సిపిఎం నాయకులను శుక్రవారం ఆర్ధరాత్రి ముందస్తు అరెస్టు చేసి లేపాక్షి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కెవిపిఎస్ రమణ, ప్రవీణ్ కుమార్, నరసింహులు తదితరులతో పాటు పేదలను అరెస్టు చేసిన పోలీసులు శనివారం సాయంత్రం విడుదల చేశారు. వీరిని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పోలీస్ స్టేషన్ వద్ద పరామర్శించారు. అనంతరం పేదలతో మాట్లాడుతూ పేదలకు ఇళ్లపట్టాలు దక్కే వరకు పోరాటం కొనసాగిద్దామన్నారు. పేదల కోసం సిపిఎం ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు.

పెనుకొండలో నాయకుల ముందస్తు అరెస్టు

పెనుకొండ టౌన్ : నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం,ఇస్లాపురం గ్రామాలలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్‌ను పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. హిందూపురంలో పోలీసులు పేదల గుడిసెల అక్రమ తొలగింపుల కోసం నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పెనుకొండ పోలీస్ స్టేషన్ కు పోలీసులు తరలించారు.



గుడిసె తొలగించడంతో చెట్టుకింద ఇంటిసామగ్రి వేసుకున్న మహిళ



గుడిసెల తొలగింపుతో నిలువ నీడ కోల్పోయిన బాధితులు



లేపాక్షి పోలీసుస్టేషన్‌లో అరెస్టు అయిన వారితో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రతి విద్యార్థికి 'అపార్' కీలకం

డిఐడిఒ రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి విద్యార్థికి అపార సంఖ్య ఎంతో కీలకమైందని శ్రీ సత్యసాయి జిల్లా డిఐఇఒ రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని ప్రతి ఒక్క విద్యార్థికి ఒక ప్రత్యేక అపార్ సంఖ్యను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సంఖ్య వల్ల విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఒక విద్యార్థి తన జీవిత కాలంలో ఒకే అపార్ నెంబర్ ను కలిగివుంటారని, ఈ సంఖ్య ద్వారా ఒక విద్యార్థి తన జీవిత కాలంలో నిర్వహించే అకాడమిక్ కార్యక్రమాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. అపార్ సంఖ్యకు సంబంధించి ఆ విద్యార్థికి ఒక డిజిటల్ లాక్ కి అకౌంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆ విద్యార్థి తన జీవిత కాలంలో పూర్తి చేసిన ప్రతి ఒక్క కోర్స్ మార్కుల జాబితాలు, సర్టిఫికెట్లు ఈ డిజిటల్ అకౌంట్లోనే నిక్షిప్తం చేయబడతాయన్నారు. తద్వారా ఈ డిజిటల్ అకౌంట్లోనే సర్టిఫికెట్లు తీసుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థి ప్రొఫైల్ నిర్వహణ, విద్యా రికార్డుల కోసం కేంద్రీకత డేటాబేస్, విద్యార్థి సమాచారాన్ని సులభంగా యాక్సెస్ చేయడం, దేశవ్యాప్తంగా డేటా మైగ్రేషన్ ఒక మేనేజ్ మెంట్ నుండి మరో మేనేజ్ మెంట్ కు తెలియజేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. దేశంలోని ప్రతి ఒక్క వ్యక్తికి ఆధార్ నెంబర్ ఎంత ముఖ్యమో అలాగే దేశంలోని ప్రతి ఒక్క విద్యార్థికి కూడా అపార్ సంఖ్య అంతే ముఖ్యమని చెప్పారు. జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యనందిస్తున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్ మెంట్లు తమ కళాశాలలోని ప్రతి ఒక్క విద్యార్థికి అపార్ సంఖ్యను తెరిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించి వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ను సంప్రదించి తమ పిల్లల అపార్ సంఖ్యను తెరిచేందుకు సహకరించాలని రఘునాథ్ రెడ్డి సూచించారు.

పేదల వైద్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే


ప్రజాశక్తి-కదిరి టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వైద్యులు, సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించడంలో వైద్యులు ముందుండాలన్నారు. ఎవరూ అలసత్వం వహించవద్దని సూచించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని, అభివృద్ధి కోసం అంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాల పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.మాజీ ఎమ్మెల్యే ఎంఎస్.పార్థసారథి, సీనియర్ డాక్టర్ శంకరయ్య కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, వైద్యులు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిరను సోలార్‌హబ్‌గా మారుస్తాం : ఎమ్మెల్యే



సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గాన్ని సోలార్‌హబ్‌గా మారుస్తామని ఎమ్మెస్ ఎంఎస్.రాజు తెలిపారు. మండలంలోని బుల్లసముద్రం, హరిసముద్రం, మనూరు, కల్లుమర్రి పంచాయతీల పరిధిలో 10 వేల ఎకరాలల్లో సోలార్ పార్క్ ఏర్పాటు కోసం శనివారం భూమిని పరిశీలించారు. ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ సోలార్ పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులకు ఏడాదికి ఎకరాకు రూ. 31 వేల లీజు చెల్లిస్తూ రెండేళ్లకు ఓ సారి 5 శాతం పెంచితో చెల్లిస్తారన్నారు. సకాలంలో వర్షాలు కురవక ఏటా నష్టపోతున్న ఈ ప్రాంత రైతుల గురించి ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సోలార్ పార్క్ ఏర్పాటుకు హామీ ఇవ్వడంతో భూములను పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, ఆర్డీవో ఆనంద్‌కుమార్, సోలార్ కంపెనీ ఇంజినీర్ శివశంకర్, మండల అధికారులు, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు కృష్ణమూర్తి, మారుతిరెడ్డి, మంజునాథ్, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, జయపాల్, రఘురాం, రైతులు పాల్గొన్నారు.

సుస్థిర పాలనే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

గుడిబండ : మడకశిర నియోజకవర్గాన్ని సోలార్‌హబ్‌గా మారుస్తామని ఎమ్మెస్ ఎంఎస్.రాజు తెలిపారు. మండలంలోని జమ్మలబండ, చిగతుర్పి, కెఎన్.పల్లి, సింగేపల్లి గ్రామాల పరిధిలోని భూముల్లో దాదాపు 6వేల ఎకరాల్లో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయడానికి శనివారం ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుస్థిర పాలన అందించడానికి కృషి చేస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులు, రైతాంగాన్ని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్, సోలార్ కంపెనీ ఇంజినీర్ శివశంకర్, మండల రెవెన్యూ అధికారులు, టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, కార్యదర్శి ప్రకాష్, నాయకులు మంజునాథ్, శ్రీనాథ్, లక్ష్మీనర్సప్ప, న్యాయవాది శివకుమార్, కరియన్న, రవిస్వామి, వెంకటేష్, నజీర్, రాజేంద్ర, భోజరాజు, జయరామప్ప, డాక్టర్ కృష్ణమూర్తి, అమరాపురం మండల కన్వీనర్ గణేష్, నిరంజన్, బాదిపల్లెప్ప, జనసేన నాయకులు మంజునాథ్, భాజపా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ



డాబా గంగయ్య

కదిరిటౌన్ : ఖాద్రి వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆవిష్కరిస్తారని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు జె.వి.రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, కదిరి డివిజన్ అధ్యక్షులు డాబా గంగయ్య, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ విలేకరుల సమావేశంలో మట్లాడుతూ వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వడ్డెర సామాజిక వర్గం ప్రజలు పెద్దఎత్తున హాజరై కదిరి చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచేలా విజయవంతం చేయాలని కోరారు.

'పురం'లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

ఎస్‌పి వి.రత్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి వి. రత్న

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రాంతంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టడమే గాక అసాంఘిక కార్యకలాపాల నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్‌పి వి.రత్న అన్నారు. శనివారం హిందూపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం డిఎస్‌పి కె.వి. మహేష్, సిఐలు, ఎస్ఐలతో పురం శాంతి భద్రతల విషయంపై సమీక్షించారు. అనంతరం ఎస్పీ స్థానిక విలేకరులతో మాట్లాడారు. హిందూపురం ప్రాంతంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా అసాంఘిక కార్యకలాపాలను అడ్డకట్ట వేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని , ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. అదే విధంగా రాత్రి వేళల్లో ప్రధాన వీధులతో పాటు శివార ప్రాంతాల్లో రెండు డ్రోన్ కెమెరాల ద్వారా పోలీస్ గస్తీ తిరగడం జరుగుతుందన్నారు. చిలమత్తూరు మండలంలో జరిగిన గ్యాంగ్ రేప్ సంఘటన దృష్టిలో ఉంచుకొని గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా వేశామన్నారు. శాంతి భద్రతలు పరిరక్షించడంలో సిబ్బంది తప్పు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని అన్నారు. ఈ సమావేశంలో ఎస్‌పితో డీఎస్పీ కేవీ మహేష్, సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, కరీం, జనార్ధన్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు ఆపన్నహస్తమందేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యానికి అన్నదాత తీవ్రంగా నష్టపోయాడు. కీలకమైన జూన్, ఆగస్టు మాసాల్లో వర్షాభావంతో నష్టపోగా, తరువాత అక్టోబరు మాసంలో కురిసిన అధిక వర్షాలకు మరో విధంగా నష్టపోయారు. రెండు విధాలుగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే సీజన్ మొత్తంగా చూసినప్పుడు వర్షపాతం సాధారణం కంటే మెరుగ్గా పడినట్టు కనిపిస్తోంది. దీంతో కరువు మండలాల ప్రకటనలో కొన్నింటికే చోటు లభించింది. చాలా మండలాలు కరువు మండలాల నుంచి మినహాయించబడ్డాయి. దీంతో ఆ మండలాల్లో వర్షాభావంతో నష్టపోయిన రైతుకు ఏ మేరకు సాయం అందుతున్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలున్నాయి. ఇందులో 17 మండలాలనే రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. తక్కిన మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చలేదు. దీంతో ఆ మండలాల్లో నష్టపోయిన రైతుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీనిపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు కీలకమైన ఆగస్టు నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నాయి. దీని మూలంగా ఖరీఫ్ ప్రధాన పంటల సాగు 20 శాతంలోపే అయిందని చెబుతున్నాయి. వేసిన పంట కూడా ఆ కాలంలో వర్షాల్లేక దెబ్బతింది. ఈనేపథ్యంలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఈ వారంలో జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలోనూ తీర్మానం చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై ఏ మేరకు స్పందిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఇకపోతే వచ్చే వారంలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. తొలిసారిగా జిల్లాకు నుంచి ఆర్థికమంత్రిగా వ్యవహరిస్తున్న పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ బడ్జెట్‌లో జిల్లాకు ఏ రకమైన ప్రాధాన్యతను కల్పిస్తారన్నది సర్వత్రా సాగుతున్న చర్చ. ప్రధానంగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనివ్వాలని సిపిఎం గత కొన్ని రోజులుగా పోరాటాన్ని కొనసాగిస్తోంది. అంతక మునుపు వారంలో ఈ అంశంపై బస్సు యాత్ర చేపట్టగా, ఈ వారంలో ప్రజాప్రతినిధులందరినీ కలసి విజ్ఞాపన పత్రాలను అందజేశారు. సోమవారం నాడుప్రవేశపెట్టే బడ్జెట్‌లో జిల్లా సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తారా లేదా అన్నది తేలనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్‌ల పంపిణీని ప్రారంభించింది. అయితే అర్హుల జాబితాలపై లబ్దిదారుల్లో ఇంకా అమోయమయం, సందిగ్ధత నెలకొంది. ఎవరికి వస్తుందో..ఎవరికి రాదోనన్న సందేహాలున్నాయి. రికార్డుల్లో చిన్నచిన్న పొరపాట్లు ఉన్నా ఉచిత గ్యాస్‌కు అర్హులవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటిని సరిచేసుకోవడానికి లబ్దిదారులు కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఇక ఆపార్ పేరుతో విద్యార్థుల నమోదు కొనసాగుతోంది. ఇందులో సాంకేతిక సమస్యలు నెలకొంటున్నాయి. వాటన్నింటినీ సరిచేసి ఎవరికీ ఇబ్బంది లేకుండా చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇందులో ఏ చిన్న తప్పు జరిగిన తల్లివందనం అందే పరిస్థితి లేదని చెబుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు నెలకొంది. రైతులు ఏటా వచ్చే రైతు పెట్టుబడి సాయం కోసమూ ఎదురు చూస్తున్నారు. ఎప్పుడూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఇచ్చేవారు. కాని ఇప్పుడు ప్రభుత్వం మారిన నేపథ్యంలో రబీ వచ్చినా రైతుకు పెట్టుబడి సాయం అందకపోవడంతో దాని కోసమూ ఎదురు చూస్తున్నారు.

సాగునీటి కాలువ మరమ్మతులు చేపట్టండి


బత్తలపల్లి చెరువును పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

పిఎబిఆర్ కుడికాలువ నుంచి బత్తలపల్లి చెరువుకు వచ్చే కాలువకు మరమ్మతులు చేపట్టాలని టిడిపి మండల నాయకులు ఇరిగేషన్ అధికారులను కోరారు. బత్తలపల్లి చెరువును శనివారం టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణ రెడ్డి, నాయకులు నెట్టెం రమణ, జక్కంపూడి నాగభూషణ పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ పిఎబిఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేస్తే ఆ నీటితో బత్తలపల్లి చెరువును నింపడానికి గతంలో కాలువ తవ్వారన్నారు. అయితే రెండు మూడేళ్లుగా పిఎబి ఆర్ కాలువ నుంచి బత్తలపల్లి చెరువుకు నీరు విడుదల చేయలేదన్నారు. నిర్వహణ లేక కాలువకు గండ్లు పడడం, తెగిపోవడం, ముళ్ల పొదలు పెరగడంతో కాలువకు నీరు విడుదల చేసినా చెరువులోకి చేరే అవకాశం లేదన్నారు. దీంతో నాయకులు ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి కాలువ సమస్యలతో పాటు చెరువులోని చెక్ డ్యాం, చెరువు కట్ట మరమ్మతులు చేయాలని కోరారు. స్పందించిన ఇరిగేషన్ అధికారులు చెరువు, కాలువను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వారి వెంట నాయకులు శ్రీరాములు, బత్తల మనోజ్, ఆదెప్ప, ముతవల్లి సులేమాన్, గుండుసాబ్, మహమ్మద్ రఫీ ఉన్నారు.

సొంత నిధులతో టిడిపి నాయకుల శ్రమదానం


మాట్లాడుతున్న మాజీ సర్పంచి రాము

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని కిరికెర గ్రామపంచాయతీలో టిడిపి నాయకులు తమ సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి సర్పంచి, అధికారులు వైసిపి హయాంలో పంచాయతీలో భూకబ్జాలు చేస్తూ, దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం స్థలాల్లో దాదాపు వెయ్యి నకిలీ పట్టాలు సృష్టించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన 5 నెలలకే ఒక్క కిరికెర పంచాయతీలోనే దాదాపు రూ.60 లక్షల నిధులను అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. కిరికెర గేట్ వద్ద రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ళ కంపలు తొలగించాలని అటు అధికారులకు ఇటు ప్రజాప్రతినిధులకు తెలియజేసిన ఏమాత్రం ప్రయోజనం కన్పించలేదన్నారు. చివరకు ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేకపోయిందన్నారు. దీంతో టిడిపి నాయకులు శ్రమదానం ద్వారా ముళ్ళకంపలను తొలగించాలని నిర్ణయించి ఈ మేరకు సొంత నిధులను సమకూర్చుకొని జెసిబి సహాయంతో కంపలను తొలగించి, రహదారిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి హెచ్.ఎన్. రాము, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ అనురాధ తెలిపారు. వారిని శనివారం కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, తోటి విద్యార్థినులు అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆంగ్ల భాషలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో సెకండ్ ఇంటర్ విద్యార్థినులు సుహానా, అఫ్సాన, లైభా సింధూస్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. తెలుగు భాషలో నిర్వహించిన పోటీల్లో మహాలక్ష్మి గంగోత్రి, నందిని, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీవో మహేష్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. ధర్మవరం రూరల్, అర్బన్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆర్డీవో పరిశీలించి బిఎల్‌ఒలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ సురేష్‌బాబు, ఈడీటి ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, బూత్ లెవల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన


కందిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత, అధికారి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

కంది పంట సాగు చేసిన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఆమె శనివారం రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలోని సొంత వ్యవసాయక్షేత్రంలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి కందిపంటను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ కంది పంటలో తెగుళ్ల నివారణ మార్గాలను సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో 25 వేల ఎకరాలకు పైగా కంది పంట సాగు చేశారని, తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు పొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు.

సాగునీటి సంఘం ఎన్నికలకు ఓటర్ల నమోదు


ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహశీల్దార్ షెహనాజ్

ప్రజాశక్తి-మడకశిర

సాగునీటి సంఘం ఎన్నికల సందర్భంగా శనివారం రొళ్ల మండల తహశీల్దార్ ఎస్.షెహనాజ్ పోలింగ్ బూత్‌ను సందర్శించారు. ఓటరు జాబితాను పరిశీలించి దరఖాస్తులు తీసుకోవాలని బిఎల్‌ఒలకు సూచించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని వివేకానందకాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పది రోజులుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా విభాగంలో పనిచేసే వారిని అడిగితే మూడు మోటార్లు చెడిపోయాయని అంటున్నారన్నారు. ఈ విషయాన్ని అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కాలనీలో సమస్యను పరిష్కరించాలని, లేనిపో ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఎంపీ బికెని కలిసిన టిడిపి నాయకులు

రొద్దం : మండలంలోని ఆర్.మరువపల్లి గ్రామంలో శనివారం పలువురు నాయకులు ఎంపి బికె.పార్థసారధిని కలిశారు. పరిగి మండలంలోని ధనాపురం వద్ద ఉన్న బస్సుషెల్టర్‌ను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారని, దానిని పునర్నిర్మించాలని, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆ మండల నాయకులు కోరారు ఎంపి సానుకూలంగా స్పందించారు. అలాగే పలు సమస్యలను విన్నవించారు. ఎంపిని కలిసిన వారిలో పరిగి మండలంలోని మాజీ సర్పంచులు ఈశ్వరప్ప, శ్రీనివాస్‌రెడ్డి, రొద్దం మండల నాయకులు నరసింహులు, మురళి, నాగరాజు, రాజప్ప, లింగప్ప, గోవిందు, ముత్యాలప్ప, సత్యశేఖర్, పవన్ ఉన్నారు.

ఉత్తమ ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆర్టీసీ ఆదాయం, అభివృద్ధికి కృషి చేసిన, విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మేనేజర్ సత్యనారాయణ నగదు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. డిఎం మాట్లాడుతూ అక్టోబర్-2024లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బందిని సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ మరింత పోటీతత్వంతో పని చేసి, ఆర్టీసీ డిపోకు మంచి గుర్తింపు తేవాలని కోరారు. ముఖ్యంగా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తిస్తూ గౌరవంగా మెలగాలన్నారు. కెఎంపిఎల్ పెంచి డిపో అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ప్రతిభ కనబరిచిన కండక్టర్లు నరసింహులు, జివిఆర్. రెడ్డి, నాగరాజు, ఎన్.నరసింహులు, డ్రైవర్లు పి.పోలేరప్ప, వి.అంజనేయులు, ఎ.నారాయణలను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు శ్రీరాములు, జివి.రెడ్డి, నాగశేఖర్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఉద్యోగులను సత్కరిస్తున్న డిఎం సత్యనారాయణ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎడిజె



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ హరీష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలన్నారు. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం పెరిగిన సాంకేతికతను మంచి కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, నవేరా, కళావతిలు బాలికా విద్య, బాల్య వివాహాలు, గృహహింస, ఓటు హక్కు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంతోషి కుమారి, అతిక్, రవికుమార్, వీర సేన, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు, హరినంద బాబు, ఊర్మిళ, సత్య, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరిక



టిడిపిలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని సింగేపల్లి గ్రామంలో శనివారం దాదాపు వంద వైసిపి కుటుంబాలు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. సోలార్ ప్లాంట్ కోసం స్థల పరిశీలనలో భాగంగా శనివారం వారు సింగేపల్లి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో వంద కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజు, గుండుమల, శ్రీనివాసమూర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీంతో ఆకర్షితులై టిడిపిలో చేరామని తెలిపారు. ఎమ్మెల్యే రాజు, గుండుమల మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బైపాస్ కెనాల్ పనులను ప్రారంభించకుండా ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, కార్యదర్శి ప్రకాష్, మంజునాథ్, శ్రీనాథ్, లక్ష్మీనరసప్ప, న్యాయవాది శివకుమార్, కరియన్న, రవిస్వామి, వెంకటేష్, నజీర్, రాజేంద్ర, భోజరాజు, జయరామప్ప, శివన్న, డాక్టర్ కృష్ణమూర్తి, ప్రజలు,పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని కదిరేపల్లి పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు శనివారం టిడిపిలో చేరారు. కదిరేపల్లి పంచాయతీతండా, కంబాలపల్లి గ్రామాలకు చెందిన గోపాల్‌నాయక్, తిప్పేనరసప్పతో పాటు 50 కుటుంబాలు వైసిపికి రాజీనామా చేసి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో కార్యకర్తలకు సముచిత గుర్తింపు


బత్తలపల్లిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీల్లో లేనివిధంగా టిడిపిలో క్రియాశీలక కార్యకర్తలకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమంపై పల్లె సమీక్ష నిర్వహించారు. పల్లె మాట్లాడుతూ సభ్యత్వ నమోదును వేగవంతం చేసి అందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సభ్యత్వాలు రికార్డు స్థాయిలో చేసి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని కోరారు. అలాగే సభ్యత్వం ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో బుక్కపట్నం, పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని కుట్లాలపల్లిలో టిడిపి మండల కన్వీనర్ మైలేశంకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు ప్రజలు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదు ప్రయోజనాలను వివరించి సభ్యతం చేయించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు ,మైలే రామచంద్ర, మంజూనాథ్‌రెడ్డి, ఎం.రవి, మంజునాథరెడ్డి, మహేందర్‌నాయక్ పాల్గొన్నారు.

బత్తలపల్లి : టిడిపి అధిష్టానం చేపట్టిన పార్టీ సభ్యత్వం పొందితే జీవితానికి భరోసా దక్కుతుందని పార్టీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి తెలిపారు. బత్తలపల్లిలో టిడిపి ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కారం-సభ్యత్వ నమోదు'పై గ్రామసభ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నెట్టెం రమణ, మనోజ్, నాగభూషణ, సులేమాన్, సుబహాన్, మహమ్మద్ రఫీ, గుండు సాబ్, శ్రీరాములు, పెద్దన్న, హరి, కృష్ణమనాయుడు, యూసుఫ్, సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం పంచాయతీలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. నాయకులు సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాల్మీకి బోయ సాధికారత సమితి స్టేట్ మెంబర్ బెల్లాలచెరువు చంద్ర, మనోహర్, జయచంద్రారెడ్డి, సత్యనారాయణ, ఈడిగ కిష్ట, లింగప్ప, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నిర్వహకులు

450 మందికి అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం 450 మందికి అన్నదానం నిర్వహించారు. నిత్యాన్నదానంలో భాగంగా కర్నాటకలోని చిత్రదుర్గకు చెందిన టిఎన్ మాలతీ, ఎం.జి. సూర్యనారాయణల కుమారుడు ధ్రువ కుమార్, రంజిత వివాహం సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు సేవాసమితి నిర్వాహకులు డాక్టర్ రవిశంకర్ తెలిపారు. కైవారం తాతయ్య భక్తురాలు అశ్వత్తమ్మ అన్నదానం కోసం 25 కేజీలు బియ్యాన్ని అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు గొల్లన్న తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ. 24 వేల నుంచి రూ. 35వేల వరకూ వేతనం చెల్లిస్తారన్నారు. గుంటూరులో 6 నెలలు శిక్షణ ఉంటుందని, ఎంపికైన అభ్యర్థుల వీసా, రానుపోనూ విమాన ఛార్జీలు సియుఆర్ఎ భరిస్తుందన్నారు. వివరాలకు 9988853335లో సంప్రదించాలన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిత

ప్రజాశక్తి-కదిరి టౌన్

కార్తీక మాసం సందర్భంగా కదిరి డిపో నుంచి ఈ నెలలో 10, 17, 24 తేదీల్లో శైవ క్షేత్రాలైన శ్రీశైలం, అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు అసిస్టెంట్ మేనేజర్ హరిత చెప్పారు. అలాగే త్రిలింగ దర్శనంలో భాగంగా బుగ్గ రామలింగేశ్వరస్వామి(తాడిపత్రి), యాగంటి, మహానంది, కోటిలింగాలు, ఈషా ఫౌండేషన్ (చిక్‌బల్లాపూర్) తదితర ప్రదేశాలకు ప్రతి సోమవారం (11, 18, 25 తేదీల్లో) ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇవే కాకుండా ప్రయాణికుల కోరిన ప్రదేశాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు 'ప్రాచీన ఆలయాల వైభోగం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలోని ప్రాచీన ఆలయాల చరిత్ర, సంస్కృతి, ప్రాచీన వైభవాన్ని నేటి తరానికి పరిచయం చేయడం కోసం 'ప్రాచీన ఆలయాల వైభోగం' పేరుతో రాసిన ఓ పుస్తకాన్ని ఆదివారం పట్టణంలోని సాయి ఆరామంలో ఆవిష్కరిస్తున్నట్లు చరిత్రకారుడు మైనాస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హేమావతితో పాటు లేపాక్షి వీరభద్రాలయం, పెనుకొండలోని కాశీవిశ్వేశ్వర, అవిముక్తేశ్వర ఆలయాలు, గోరంట్ల మాధవరాయలు గుడి, వానవోలు రంగనాథస్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి, తదితర ఆలయాల గురించి ఈ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఎంపి బికె.పార్థసారధి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డి, తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

బాలికల క్రికెట్ పోటీల్లో ధర్మవరం జట్టు విజేత


హస్మిత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ బాలికల పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నార్పల, ధర్మవరం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నార్పల 23.3 ఓవర్లలో 100 పరుగులకు అటౌట్ అయింది. ధర్మవరం జట్టులోని హస్మిత 5 వికెట్లు పడగొట్టింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 9 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 102 పరుగులు చేసి ఘన విజకయం సాధించింది. హస్మిత 31 బంతుల్లో 56 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసింది. విజేత జట్టుకు కోచ్ రాజశేఖర్, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

11న మైనార్టీ వెల్ఫేర్ డే

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని సాయి ఆరామంలో ఈ నెల 11వ తేదీ మైనార్టీ వెల్ఫేర్ డేతో పాటు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రామసుబ్బారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ముస్లిం నాయకులు, మత పెద్దలు, అధికారులు, విద్యార్థులు, పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీలు

పుట్టపర్తి రూరల్ : అక్రమ రవాణాను అరికట్టేందుకు శనివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారులు, హైవేలు, ముఖ్య కూడళ్లలో రోడ్డు భద్రతా నియమాలు ఉల్లం ఘించిన వారికి జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండాలన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం రూరల్ : చూపులేని వారికి చూపు ప్రసాదించడమే రోటరీ క్లబ్ లక్ష్యమని క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్తా, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో శనివారం వారు మాట్లాడుతూ ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. గోరకాటి పుల్లమ్మ, గోరకాటి పెద్దారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు, కోడళ్లు గోరకాటి ప్రమీదమ్మ, గోరకాటి రఘునాథరెడ్డి సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం


విజయ్‌కుమార్(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పెనుకొండ

ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో ఓ మాజీ పాత్రికేయుడు మృతి చెం దాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. పెనుకొండ పట్టణానికి చెందిన విజయ్‌కుమార్ (35), నందికేశవరెడ్డి ద్విచక్ర వాహనంపై సోమందేపల్లి నుంచి పెనుకొండకు బయల్దేరారు. మార్గ మధ్యలో ఈశ్వర్ ఫ్యాక్టరీ సమీపంలో పంపు హౌస్ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. నందికేశవరెడ్డి తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విజయ్ కుమార్ గతంలో ఓ దినపత్రిక విలేకరిగా పని చేశారు. ప్రస్తుతం అతడు కంప్యూటర్ మరమ్మతులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతడికి భార్య, పిల్లలున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని ఈదుల ముష్టూరు క్రాస్ వద్ద అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మొండి మద్దిలేటి(39) మృతి చెందినట్లు పోలీసులు తెలి పారు. ధర్మవరం మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి(మరుగుజ్జు) వికలాంగుడు. ఈ నెల 3వ తేదీ మూడుచక్రాల వాహనంపై అనంతపురం నుంచి మల్కాపురానికి వెళుండగా కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో మద్దిలేటి తీవ్రంగా గాయపడగా వెంటనే అనంతపురం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందతున్న మద్దిలేటి శనివారం మృతి చెందాడు. కాగా ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు సీసీ కెమెరాల సాయంతో గుర్తించి స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గొట్లూరు చోరీ కేసులో అల్లుడే దొంగ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఇటీవల మండలంలోని గొట్లూరు గ్రామంలో జరిగిన ఓ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. తాళం వేసి ఉన్న గొట్లూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన సాకే ఓబుళమ్మ ఇంట్లో ఈ నెల 5వ తేదీ దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి 6.5 తులాల బంగారం నగలు ఎత్తుకెళ్లారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రూరల్ పోలీసులు నాలుగు రోజుల్లోనే ఛేదించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. ఓబుళమ్మ పదేళ్ల క్రితం తన పెద్ద కూతురు పుష్పాంజలికి ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చందమూరు రవిచి వివాహం జరిపించారు. వారి కాపురం మూడేళ్లు సజావుగా సాగింది. ఆ తర్వాత వారి మధ్య గొడవల కారణంగా విడిపోయారు. అప్పటి నుంచి పుష్పాంజలి పుట్టింట్లోనే ఉంటుంది. ఇక చెడు వ్యసనాలకు అలవాటు పడిన అల్లుడు రవి ఈ నెల 5వ తేదీ కూతురికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి గొట్లూరు గ్రామం వచ్చాడు. ఆ సమయంలో ఇంటి తలుపునకు తాళం వేసి ఉండగా రవి తాళం పగుల కొట్టి బీరువాలో ఉంచిన బంగారు నగలు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలించారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు నాగలూరు గ్రామంలోని బస్టాప్ వద్ద నిందితుడు రవిని అరెస్టు చేసి అతడి నుంచి దొంగలించిన సొమ్మును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు. కేసు ఛేదించిన సిఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని శాంతినగర్‌లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించారు. బాధితురాలు తెలిపిన వివరాలు.. శాంతినగర్‌కు చెందిన రాములమ్మ తన బిడ్డ ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్కులు వేసుకొని వచ్చి ఆమె మెడలో ఉన్న 3.5 తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. విషయం తెలిసిన వెంటనే పట్టణ సిఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకొన్నారు. అలాగే చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. అలాగే బాధితురాలు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

భూమి విషయంలో మోసం చేశారని ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

10 సెంట్ల భూమి కొనుగోలు విషయంలో ఇద్దరు వ్యక్తులు తనను మోసం చేశారని ధర్మవరం రూరల్ మండలంలోని పోతులనాగేపల్లి గ్రామానికి చెందిన గాదికుంట శివకేశవ శనివారం పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు.. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎఆర్ కానిస్టేబుల్‌గా పని చేసే సాకే శివయ్య, పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లితండాకు చెందిన రమావత్ చెన్నకేశవనాయక్ కలిసి తనకు 10 సెంట్ల భూమిని విక్రయించారన్నారు. సెంటు ధర రూ. 2.4 లక్షల చొప్పున రూ. 24 లక్షలు తీసుకున్నారన్నారు. అయితే ఆ భూమిపై సాకే శివయ్య, రమావత్ చెన్నకేశవ నాయక్‌కు ఎలాంటి హక్కులు లేవని తెలిసి నా డబ్బులు వెనక్కు ఇవ్వాలని కొన్ని నెలలుగా వారి చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయాడు. పోలీస్ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని అతడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

దూషించాడని మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై..

ప్రజాశక్తి-రొద్దం

ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద బిల్లులు పెట్టలేదని తనపై మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడారని ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్ రవి తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ రవి తెలిపిన వివరాలు.. రవి ప్రస్తుతం మండలంలోని చోలేమర్రి గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చేయడానికి గత ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన వ్యక్తిని రికార్డులు కోరాడు. అయితే అతడు మస్టర్లను ఇవ్వకుండా ఇంటికి తీసుకెళ్తుండగా రవి అడ్డుకున్నాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరగ్గా అతడు నానా బూతులతో తిట్టాడని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ రవి తెలిపారు. అతడి నుంచి తనకు ప్రాణహాని ఉందని రవి వాపోయడు.

అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండలంలోని పాలసముద్రం సమీపంలోని బెల్లాలచెరువు వద్ద శనివారం ఓ కారు అదుపు తప్పి పొలంలోకి దూసికెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కియా అనుబంధ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగి కారులో వెళ్తుండగా అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. సమీపంలో ఉన్న రైతులు గమనించి అక్కడికి చేరుకుని కారులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీశారు. వారికి స్వల్ప గాయాలు కాగా పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కర్నాటక మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శనివారం హిందూపురం, పరిగి మండలాల్లో దాడులు నిర్వహించి ఆరుగురు కర్నాటక మద్యం విక్రేతలను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు. 184 కర్నాటక మద్యం ప్యాకెట్ల ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్ మెంట్ సిఐ సునంద, ఎస్ఐలు ఫరూక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అహుడా ఛైర్మన్‌గా టిసి వరుణ్ నియామకంపై హర్షం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు టిసి.వరుణ్‌ను అహుడా ఛైర్మన్‌గా నియమించడం పట్ల శనివారం ఆ పార్టీ నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, అబ్దుల్, తదితరులు ఒ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం జనసేన పార్టీకి సముచిత స్థానం కల్పించిందన్నారు. అనంతపురం, హిందూపురం అభివృద్ధి అథారిటీ ఛైర్మన్‌గా వరుణ్ నియమించడం హర్షణీయమన్నార. వరుణ్ జనసేన పార్టీ నాయకుడిగా మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఆయన ఎంపిక పట్ల సిఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.